క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవ స్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ , అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫేస్‌రీడింగ్ అటెండెన్స్ రద్దు చేయాలని కోరారు.

శ్రీశైలం వన్‌టౌన్ కానిస్టేబుల్ హఠాన్మరణం



నవరత్నారావు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నవరత్నారావు (53)గుండెపోటుతో హఠాన్మరణం చెందారని వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఉండగా హఠాత్తుగా ఫిట్స్ రావడంతో వెంటనే దేవస్థానం వైద్యశాలకు తరలించామని చెప్పారు. అక్కడ డాక్టర్లు ప్రథమ చికిత్స నిర్వహించి ఫిట్స్ నివారించగలిగినప్పటికీ తీవ్ర స్థాయిలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారని చెప్పారు. నంద్యాలలోని వారి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. గురవారం ఉదయం ఆయన మృతదేహాన్ని శ్రీశైలం నుంచి నంద్యాలకు తీసుకువెళ్లినట్లు చెప్పారు. వన్‌టౌన్, టూ టౌన్ పోలీసులు ఆయన మృతికి నివాళులర్పించి, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి



కొత్త ప్రింటర్‌ను ఎంఈఓకు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పగిడ్యాల: మండలంలోని ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహించే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 24 మందికి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి లభించిందని మండల విద్యాధికారి సుభాన్ తెలిపారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు గురువారం విద్యాధికారి కార్యాలయంలో ఆర్డర్ కాపీలను అందజేశామని చెప్పారు. బదిలీ అయిన స్థానంలో శుక్రవారం విధుల్లో చేరుతారని పేర్కొన్నారు. అలాగే బదిలీ అయిన ఉపాధ్యాయులు కార్యాలయానికి రూ. 18 వేల విలువ చేసే కొత్త ప్రింటర్‌ను అందించినట్లు తెలిపారు.

హెచ్‌ఎంపై సర్పంచ్ ఫిర్యాదు

జూపాడుబంగ్లా: ప్రొటోకాల్ పాటించని పోతులపాడు మజరా గ్రామమైన చాబోలు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పల్లె నిర్మలమ్మ గురువారం ఎంపీడీఓ మంజులవాణి, ఎంఈఓ మోహన్‌లకు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామ మొదటి పౌరురాలినైన తనకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని, పాఠశాలలో ఆగస్టు15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు ఏ కార్యక్రమం జరిగినా సమాచారం ఇవ్వడం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వ్యక్తిని 108లో తరలిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: రోడ్డు ప్రమాదంలో తాటిపాడు రైతు భరోసా కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న కోలె వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం నందికొట్కూరు నుంచి అతని స్వగ్రామమైన తంగెడంచకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో ఏసర్ పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన మినీ ఆల్విన్ వెంకటరమణ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో అతని కాలు విరగటంతో తీవ్రంగా గాయపడగా.. చికిత్సనిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీజీ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు



శ్రీశైలంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఐటీడీఏ పీఓ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి



ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు అంజాద్ అలీ

మురిసిన మువ్వన్నెల జెండా

- ఘనంగా గణతంత్ర దినోత్సవం

శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల పరిధిలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా మువ్వనెల జెండా రెపరెపలాడింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండా ఆవిష్కరణ గావించారు. దేశనాయకులు చిత్రపటాలకు నివాళులర్పించారు. పలువురు వక్తలు గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత, భారత రాజ్యాంగం గురించి వివరించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు విద్యాలయాల్లో వివిధ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. – సాక్షినెట్‌వర్క్



పగిడ్యాల మండలం పడమర నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



సర్వమతాలు ఒక్కటే అని తెలిపేలా తలపై టోపీ, నుదుట తిలకం, మెడలో శిలువ ధరించి, జాతీయ జెండాలను పట్టుకొని, మైకు చేత బూని పాములపాడు గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ జాతీయ సమైక్యత గురించి వివరిస్తున్న ఏపీ మోడల్‌స్కూలు అధ్యాపకుడు కురువ ఉచ్చిరెడ్డి



మహానంది తహసీల్దార్ కార్యాలయంలో జెండావందనం



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ దాస్



మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ సిరాజుద్దీన్



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న చైర్‌పర్సన్ ఆసియామారూఫ్



వెలుగోడులో పారిశుద్ధ్య కార్మికులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ జయపాల్ తదితరులు



బండిఆత్మకూరులో జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి

శ్రీశైలాన్ని మరింత ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతాం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శ్రీశైలక్షేత్రాన్ని మరింత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు శ్రీశైలదేవస్థాన ఈఓ ఎస్ లవన్న అన్నారు. గురువారం శ్రీశైల దేవస్థానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవస్థాన పరిపాలనా కార్యాలయ భవనం ప్రాంగణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి మహాగణపతిపూజ జరిపించిన అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలు అర్పించారు. అనంతరం దేవస్థాన సెక్యూరిటీ సిబ్బంది, దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, హోంగార్డ్స్ పతాక వందనం చేయగా ఈఓ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గత సంవత్సర కాలంలో శ్రీశైలదేవస్థానం సాధించిన ప్రగతిని వివరించారు.



జాతీయ జెండాను ఆవిష్కరించి నమస్కరిస్తున్న ఈఓ ఎస్ లవన్న

మందులను సిద్ధంగా ఉంచుకోండి

శ్రీశైలమహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరం అయ్యే మందులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఈఓ ఎస్ లవన్న ఆదేశించారు. గురువారం శివదీక్షా శిబిరాలు, కల్యాణకట్ట, పాతాళగంగ, ఏపీ టూరిజం, దేవస్థాన వైద్యశాల, సామన్లు భద్రపరుచుగది తదితర వాటిని పరిశీలించి, సంబంధింత అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యశాలకు అవసరం అయిన మందులన్నింటిని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్యుల సూచనల మేరకు కావాల్సిన ఔషధాలను సమకూరుస్తూ ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎవరైనా అపాయస్థితిలో ఉన్నప్పుడు తక్షణ వైద్యాన్ని అందించగలగాలన్నారు. మరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈఈ వి.రామకృష్ణ, ఏఈఓ ఫణిదర్‌ప్రసాద్, డీఈ చంద్రశేఖర్‌శాస్త్రి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, ఏఈ రంగప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మహిళలకు చెక్కుల పంపిణీ
- పశు సంచార అంబులెన్స్ ప్రారంభం



మహిళలకు మోడల్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన పశు సంచార అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం రేగడగూడురు గ్రామంలో డ్వాక్రా జేఎల్‌జీ గ్రూపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. ఏదో ఒక పథకం కింద ప్రతి ఇంటిలో మహిళలు లబ్ధి పొందుతున్నారన్నారు.

రుణమాఫీ పేరుతో చంద్రబాబు మోసం

చంద్రబాబు గత ఎన్నికల్లో రైతులకు రుణాలు మాఫీ చేస్తానని, పొదుపు రుణాలు చెల్లించాల్సిన అవసరం లేదని మాయ మాటలు చెప్పి మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా వైఎస్ జగన్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని చెప్పారు. టీడీపీ హయాంలో నిర్వహించిన ప్రజా సాధికారత సర్వేలో అవకతవకల కారణంగా కేంద్ర ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదన్నారు. రేగడగూడురు సొసైటీ ద్వారా రూ.12.45 కోట్ల వ్యవసాయ రుణాలు అందించామన్నారు. రేగడగూడురు గ్రామంలో శివాలయానికి రూ.1.40 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, వెటర్నరీ ఏడీ ధనుంజయుడు, కేడీసీసీ డైరెక్టర్ నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, సొసైటీ చైర్మన్ బన్నూరు విజయలక్ష్మి, నాయకులు తిరుపంరెడ్డి, రామిరెడ్డి, కుళ్లాయిస్వామిరెడ్డి, బన్నూరు జనాభారెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, సొసైటీ సీఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు స్త్రీనిధి రుణాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందించనున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం ఈ.శివచెన్నరాయుడు తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు రుణాలు అవసరమైన మహిళా సంఘాలు వీఓఏల ద్వారా సభ్యులతో బయోమెట్రిక్ వేయించి డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మండలంలో 21 మహిళా సంఘాలలోని 2,397మంది మహిళలు అర్హత కలిగి ఉన్నారని తెలిపారు.

మహానందిలో త్వరలో వడ్డెర్ల అన్నదానసత్ర భవనం

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలో త్వరలో వడ్డె, వడియరాజుల నిత్యాన్నసత్రం భవనం నిర్మిస్తామని మహానంది క్షేత్ర వడ్డె, వడియరాజుల అన్నసత్రం ముఖ్య సలహాదారుడు గోగుల హరి, గౌరవాధ్యక్షుడు కుంచపు పెద్ద వెంకటేశ్వర్లు తెలిపారు. మహానందిలో గురువారం అన్నసత్రం తరపున క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ అన్నసత్రం భవనం నిర్మాణం త్వరలో పూర్తి చేసి, మహానంది వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వేముల వెంకటస్వామి, గౌరవాధ్యక్షుడు పల్లె చిన్న వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు సంపంగి చిన్న సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు గోగుల గోపాల్, ప్రధాన కార్యదర్శి గోగుల చిన్న నరసింహుడు, నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ చల్లా వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, శివరామ్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న వడ్డెర నాయకులు

ఐటీడీఏ పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం

మహానంది: పేదరికంలో ఉంటూ అడవితల్లినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నెరవేర్చారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని ఐటీడీఏ పాఠశాలలో సుమారు ఆరు నెలలుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో అక్కడ విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులు ప్రభుత్వ యూపీ పాఠశాలలో చేరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విషయంపై ఐటీడీఏ పీఓ, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ మేరకు ఐటీడీఏ పాఠశాలకు అహోబిలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పద్మనాభరావును గాజులపల్లె ఆర్‌ఎస్ ఐటీడీఏ పాఠశాలకు డిప్యూటేషన్‌పై నియమించారు. దీంతో సుమారు ఆరు నెలల తర్వాత మళ్లీ చెంచుగూడెంలో పాఠశాలలో విద్యార్థులు చేరడం, ఉపాధ్యాయులు రావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో ఉన్న కురువపేటలో శుక్రవారం ఉదయం 10.30గంటలకు రెండోవ రోజు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిశోర్ గురువారం తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో పాల్గొనాలని ఆదేశించారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు

- కొలనుభారతి క్షేత్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం
- కాశిరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం





ప్రత్యేక అలంకరణలో కొలనుభారతీ దేవి, శ్రీశైలం దేవస్థానం ఈఓ లవన్న, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ను సత్కరిస్తున్న కొలనుభారతి ఈఓ మోహన్

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని కొలను భారతి క్షేత్రంలో గురువారం అమ్మవారి పుట్టిన రోజు, వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తమ చిన్నారులకు క్షేత్రంలోని సరస్వతీదేవి సన్నిధానంలో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను కాశిరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సత్రం వారు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్‌యాదవ్, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఈఓ మోహన్, పురోహితులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

అమ్మవారి పుట్టిన రోజు వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు నందికొట్కూరు రూరల్ సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐలు పాములపాడు అశోక్, ఆత్మకూరు క్రిష్ణ మూర్తి, వెలుగోడు జగన్‌మోహన్, నందికొట్కూరు ర మణ, 30 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా శివపురం చెంచుగూడెం వద్దనే వాహనాలు నిలిపి వేశారు. అక్కడి నుంచి ఆటోల్లో ప్రయాణికులు దేవస్థానానికి వెళ్లారు.

కొలనుభారతి క్షేత్ర అభివృద్ధికి సహకారం

కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షత్రం అభివృద్ధికి సహకరిస్తానని శ్రీశైలం దేవస్థానం ఈఓ లవన్న అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్షేత్ర అభివృద్ధి కోసం డెవలప్ ఫండ్ ఇవ్వాలని కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతానన్నారు. అలాగే మంత్రితో మాట్లాడతానని, శ్రీశైలం నుంచి నిధులు ఇవ్వడానికి కృషి చేస్తానని, నియమ నిబంధనల ప్రకారం అభివృద్ధికి దోహదపడతామన్నారు. ప్రతిపాదనలు సిద్ధి చేసి తనకు పంపాలని కొలనుభారతి ఈఓకు సూచించారు.

కొలనుభారతి దేవికి లక్ష్మీహారం బహూకరణ

కొలనుభారతి క్షత్రంలో వెలసిన అమ్మవారికి బంగారు లక్ష్మీ హారాన్ని కానుకగా ఇచ్చారు. గురువారం అమ్మవారి పుట్టిన రోజు పండుగ సందర్భంగా శ్రీరామ సీడ్స్ కర్నూలుకు చెందిన చుండూరు ఆంజనేయస్వామి, సుబ్బాయమ్మ దంపతులు సుమారు నాలుగున్నర తులాల బంగారు హారాన్ని ఈఓ మోహన్‌కు అందజేశారు. దీని విలువ దాదాపు రూ.2.52లక్షలు అని దాతలు తెలిపారు.

నంద్యాల ప్రథమ నంది ఆలయంలో..

నంద్యాలవ్యవసాయం: మాఘ శుద్ధ పంచమి, చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక ప్రథమనంది దేవస్థానంలో గురువారం గాయత్రి దేవాలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించి, అమ్మవారిని పెన్నులతో అలంకరించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అమ్మవారి కంకణాలు, పెన్నులు అందజేశారు. సుధీర్, మాజీ శాస్త్రవేత్త రవీంద్రనాథ్, కేశవమూర్తి, నాగేంద్ర, ప్రశాంతి పాల్గొన్నారు. అలాగే సంజీవనగర్ రామాలయంలోని శ్రీకోదండ రామాలయంలో వెలసిన సరస్వతీదేవి అమ్మవారికి శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక ఉచిత లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరిపించారు.